

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ
- 37 కిలోల గంజాయి, కారు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- నలుగురి అరెస్ట్, ఒకరు పరారీలో

2లో...



రిమ్స్ మార్చురీ వద్ద ఉద్రిక్తత

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన
- నిరసనకారుల అరెస్ట్

5లో...



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | శనివారం | నవంబర్ 4, 2023 | www.navatelangana.com

బీఆర్ఎస్‌లో జోష్..!



- సీఎం ప్రసంగంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం
- పదేండ్ల పాలనలో కర్ఫ్యూ, కరువు లేదని వ్యాఖ్య
- ముధోల్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని భరోసా
- విఠల్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి
- ప్రజాఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన జనం

నవతెలంగాణ- భైంసా, ముధోల్

నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. మరోసారి గెలుపు తమదేనని కార్యకర్తల్లో భరోసా నింపింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డెన్నగారి విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భైంసా పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు వద్ద నిర్వహించిన ఈ సభకు భారీగా జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ, రాష్ట్ర పరిస్థితులతో పాటు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపైనా వివరించారు. మరోసారి అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులను కొనసాగిస్తామని దీవించాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు సభాస్థలికి వచ్చిన కేసీఆర్‌కు ఆ పార్టీ ముఖ్య నాయకులు స్వాగతం పలికారు. సభావేదికపైనా వస్తుండగా..కిందనున్న కార్యకర్తలు కేరింతలు కొడుతూ చప్పట్లతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతకుముందు కళాకారులు బీఆర్ఎస్ గీతాలు పాడుతున్న సమయంలో మహిళలు, యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్న సమయంలోనూ ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ బీఆర్ఎస్ అనుకూల నినాదాలు చేశారు.

చదువులతల్లి కొలువైన పుణ్యభూమి

ముధోల్ నియోజకవర్గం చదువుల తల్లి కొలువుదీరిన పవిత్రమైన పుణ్యభూమి అని ముఖ్యమంత్రి సంబోధించారు. బాసర ఆలయం అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.50కోట్లు కేటాయించామని, మరోసారి అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ రాకముందు గడ్డెన్న ప్రాజెక్టు ద్వారా 4వేల ఎకరాలకు సాగునీరందేదని, ఇప్పుడు 12వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని గుర్తు చేశారు. 24గంటల కరెంటుతో బ్రహ్మాండమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. భైంసా అంటేనే ఏదేదో అబద్ధాలు ప్రచారం చేశారని, ఇక్కడ హిందూ, ముస్లింలు వందల ఏండ్ల నుంచి కలిసి బతుకుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి కర్ఫ్యూ లేదని, ఇలాంటి ప్రశాంత వాతావరణం ఉండాలా..లేదా అనేది ప్రజలు ఆలోచించాలని సూచించారు. మరోసారి విఠల్‌రెడ్డిని గెలిపించాలని..బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని మిగతా..2లో...

ఉమ్మడి ఆదిలాబాద్‌లో

మొదటి రోజు ఎనిమిది నామినేషన్లు

నవతెలంగాణ-విలేకరులు

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆదిలాబాద్ నియోజక వర్గం నుంచి ఒక నామినేషన్ దాఖలైంది. స్వతంత్ర అభ్యర్థి అన్నం దేవేందర్ తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ముధోల్ నియోజకవర్గం నుంచి మిగతా..2లో...

ముధోల్ : రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నారాయణరావు పటేల్



ఎన్నికల వేళ..కొనుగోళ్లు ఎలా..?

జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. కానీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాడ కనిపించడం లేదు. ఎన్నికల హడావిడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి ఆలోచించే వారే కరువయ్యారు. పొలాలు కోతకు వచ్చినా పొలాల్లో తడి ఆరకపోవడంతో గంటలో కోయాల్సి ఎకరం పొలానికి ప్రస్తుతం రెండు గంటల నుండి మూడు గంటల సమయం పడుతోంది. దీంతో రైతుకు అదనపు భారం పడుతోంది. ఎలాగోలా కోతలు కోసి ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తే అక్కడ కొనుగోళ్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కోతలు ప్రారంభమై 10 రోజులవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల బిజీలో పడి కొనుగోలు కేంద్రాల గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఎలక్షన్ బిజీలో అధికారులు
- ప్రచార పర్వంలో ప్రజాప్రతినిధులు
- జాడలేని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- జిల్లాలో 10రోజులుగా ఎదురుచూస్తున్న రైతులు



నవతెలంగాణ-హాజీపూర్

ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు 10 రోజులుగా కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఓ పక్క వరి కోతలు సాగుతుంటే కొనుగోలు కేంద్రాల జాడలేక రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని హాజీపూర్, దండేపల్లి, లక్షెట్టిపేట్ మండలాల్లో 10 రోజులుగా రైతులు వరి కోతలు కోస్తున్నారు. ఈ రోజుల్లో తుఫాను, అల్పపీడన ద్రోణి ప్రభావాలతో ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితులున్నాయి. ఈ భయంతో రైతులు వరి కోతలను ప్రారంభిస్తుంటే మరో పక్క ధాన్యాన్ని ఎక్కడ అమ్మాలో అర్థం కావడం లేదు. వర్షాల మిగతా..2లో...

బీఆర్‌ఎస్‌లో జోష్‌..!

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు.

తరలివచ్చిన జనం..!



బీఆర్‌ఎస్‌ ప్రజా ఆశీర్వాద సభకు జనం భారీగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి సభ మధ్యాహ్నం ప్రారంభం కాగా..జనాలు మాత్రం ఉదయం 11గంటల నుంచే సభా ప్రాంగణానికి వరుసకట్టారు. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలతో పాటు కాలినడకన వివిధ గ్రామాల నుంచి తరలివచ్చారు. సభా ప్రాంగణం మొత్తం గులాబీమయంగా మారింది. సభ పరిసరాల్లో ఎక్కడ చూసినా మెడలో కండువాలు, జెండాలతో కనిపించారు. సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో కేరింతలు కొడుతూ ఉత్సాహాన్ని కనబర్చారు. సభ ముగిసిన తర్వాత మరోసారి బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వస్తుందని భరోసాతో ఇంటిదారి పట్టారు. పట్టణంలో జనాలతో ట్రాఫిక్‌కు కొంత సమయం అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు డా.రమాదేవీ, లోలం శ్యాంసుందర్‌, కృష్ణ, మురళీగౌడ్‌, విలాస్‌గాదేవార్‌, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం నిధులు ఇవ్వండి : విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి

ఇచ్చిన మాట ప్రకారం గతంలో నియోజకవర్గానికి అనేక నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలి. నియోజకవర్గంలో మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన ఎస్టీ సోదరులు అనేక ఏండ్లుగా ఇక్కడే



ఉంటున్నారని, వారికి వివిధ రకాల పత్రాలు ఉన్నా కుల సర్టిఫికేట్‌ లేదని గుర్తు చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలి. భారీ వర్షాలతో కొట్టుకుపోయిన సిరాల ప్రాజెక్టు, మరో 20చెరువుల పునరుద్ధరణకు నిధులు ఇవ్వాలి. గడ్డెన్నవాగు ప్రాజెక్టు సీసీ లైనింగ్‌ పనులకు మరిన్ని నిధులు ఇవ్వాలి. ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు నీటిని నింపేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

మొదటి రోజు ఎనిమిది నామినేషన్లు

కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్‌ తన నామినేషన్‌ పత్రాన్ని రిటర్నింగ్‌ అధికారికి అందజేశారు. బెల్లంపల్లిలో బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి నామినేషన్‌ దాఖలు చేశారు. చెన్నూర్‌లో ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ నుండి సోగాల సంజీవ్‌, మంచిర్యాలలో విద్యార్థుల రాజకీయ పార్టీ నుండి గొర్లపల్లి సురేష్‌ నామినేషన్‌ వేశారు. సిర్పూర్‌(టి) నుండి కాంగ్రెస్‌ అభ్యర్థి రావి శ్రీనివాస్‌ తన సతీమణితో కలిసి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఖానాపూర్‌ నుండి పిరమిడ్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా అభ్యర్థిగా తాటి విజయ రిటర్నింగ్‌ అధికారి జీవాకర్‌రెడ్డికి నామినేషన్‌ పత్రాలు అందజేశారు.

నామినేషన్‌లు సకాలంలో దాఖలు చేయాలి

సిర్పూర్‌(టి): పోటీ చేసే అభ్యర్థులు సకాలంలో నామినేషన్‌లు దాఖలు చేయాలని రిటర్నింగ్‌ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారీ సూచించారు. తహసీల్దార్‌ కార్యాలయంలో నామినేషన్లను ఆయన స్వీకరించారు. తొలి రోజు కాంగ్రెస్‌ అభ్యర్థి రావి శ్రీనివాస్‌ తన సతీమణితో కలిసి నామినేషన్‌ను దాఖాలు చేశారు. ఈ సందర్భంగా దీపక్‌ తివారీ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌ ప్రకారం 10వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్‌ దాఖలు చేయాలన్నారు. 13న పరిశీలన, 15వరకు ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. నామినేషన్‌ దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని, నామినేషన్‌ స్వీకరణ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో అభ్యర్థితో కలిసి ఐదుగురికి అనుమతి ఉంటుందన్నారు. మూడు వాహనాలు అనుమతి ఉంటుందని, ఒక అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చని, అత్యధికంగా రెండు ప్రాంతాల్లో పోటీ చేయచ్చని తెలిపారు.

ఆదిలాబాద్‌టౌన్‌ : ఆదిలాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్‌ వచ్చింది, బోథ్‌ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్‌ కూడా రాలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ తెలిపారు. కౌంటర్‌ నెంబర్‌ -1 వద్ద నామినేషన్ల దరఖాస్తు పత్రాలు లభిస్తాయని, కౌంటర్‌ నెంబర్‌ -2 వద్ద సహాయ కేంద్రంలో వివరాలు పరిశీలించుకొని రిటర్నింగ్‌ అధికారికి అందజేయవచ్చని తెలిపారు. జనరల్‌ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు డిపాజిట్‌ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో రిటర్నింగ్‌ అధికారులు బి.స్రవంతి, చాహత్‌ బాజ్‌పాయ్‌ పాల్గొన్నారు.

ముధోల్‌ : నామినేషన్ల పర్వం ప్రారంభమైన మొదటిరోజు ముధోల్‌ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్‌ అభ్యర్థి భోస్లే నారాయణరావు పటేల్‌ నామినేషన్‌ దాఖలు చేశారు. నలుగురు పార్టీ ప్రతినిధులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్‌ కార్యాలయాన్ని చేరుకొని రెండు సెట్ల నామినేషన్‌ పత్రాలు ఆర్‌ఓ కోమల్‌రెడ్డికి అందజేశారు.

ఉట్నూర్‌: ఖానాపూర్‌ పిరమిడ్‌ పార్టీ ఇండియా అభ్యర్థిగా తాటి విజయ నామినేషన్‌



అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్‌

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌

అక్రమ మార్గంలో త్వరగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ డి ఉదయ్‌ కుమార్‌రెడ్డి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఐదుగురు ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయిని కొనుగోలు చేసి ఆదిలాబాద్‌ రైల్వే పరిసర ప్రాంతంలో ఎక్కువ ధరకు అమ్మడానికి తిరుగుతుండగా ఆదిలాబాద్‌ రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌ఐ, సిసిఎస్‌ ఇన్‌స్పెక్టర్‌కు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేస్తే గంజాయితో పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుండి మొత్తం 21 పాకెట్లలో 37కిలోల గంజాయి(విలువ దాదాపు 9.25లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. నరేంద్ర మగర్‌, రాజా రన్బీడే, షేక్‌ జావిద్‌, రుక్సానా నలుగురు నిందితులను అరెస్టు చేశారు. షేక్‌ కుర్బాన్‌ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుండి మూడు మొబైల్‌ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ముఖ్యపాత్ర పోషించిన సిసిఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ డి సాయినాథ్‌, సిబ్బందికి నగదు బహుమతితో ప్రశంసించారు. కార్యక్రమంలో డిఎస్పి వి ఉమేందర్‌, రెండవ పట్టణ సీఐ అశోక్‌, ఎస్సై ప్రదీప్‌ కుమార్‌, సిసిఎస్‌ సిబ్బంది ఎండి సిరాజ్‌, గంగారెడ్డి, జాకీర్‌ అలీ, వెంకటరమణ, శ్రీనివాస్‌, రాహత్‌, నరేష్‌ గంగాసింగ్‌, అరుణ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడించడమే డీవైఎఫ్‌ఐ ధ్యేయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్‌



నిరుద్యోగులను నట్టేట ముంచిన బిజెపి, బిఆర్‌ఎస్‌ ఓటమే తమ లక్ష్యమని, యువత మేల్కొని రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గెడాం టీకానంద్‌ అన్నారు. జిల్లా కార్యాలయంలో డివైఎఫ్‌ఐ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సంఘం కార్యదర్శి గొడిసెల కార్తీక్‌తో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివైఎఫ్‌ఐ 1980వ సంవత్సరంలో పంజాబ్‌ రాష్ట్రంలోని లుధియానా జిల్లాలో ఏర్పాటైందన్నారు. ప్రథమ మహాసభల్లో విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం అని నినాదంతో అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూ నిరుద్యోగ యువతకు దిక్సూచిగా నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశాయని, 10 సంవత్సరాల పరిపాలనలో ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిరుద్యోగులని నట్టేట ముంచి ఎన్నికలకు సిద్ధమైందన్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చని బిఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు ఓడించాలన్నారు. 37 జీవో వల్ల జిల్లాలోని నిరుద్యోగ యువత పూర్తిగా నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి మతం, కులం పేరుతో మనుషుల మధ్య చిచ్చు పెడుతూ యువతను మతం మత్తులో ముంచుతోందని తెలిపారు. ఆ పార్టీ చెప్పే మాటలు యువత నమ్మొద్దని, నిరుద్యోగులను రెండు పార్టీలు కూడా మోసం చేశాయన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పే విధంగా యువత రాజకీయాల్లోకి వచ్చి రాణించాలన్నారు. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. 317 జీవోపై జిల్లా యువత నాయకులను ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపల్లి రాజేష్‌, జిల్లా కమిటీ సభ్యులు దుర్గం రాజ్‌కుమార్‌, శివ పాల్గొన్నారు.

ఎట్టకేలకు గుండి వాగుపై తాత్కాలిక వంతెన



నవతెలంగాణ-ఆసిఫాబాద్‌

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి వాగుపై తాత్కాలిక వంతెన ఏర్పాటైంది. ప్రతి వర్షాకాలం పూర్తి అయిన తర్వాత తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసుకుంటారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో వంతెన నిర్మించనిదే ఓట్లు వేయమని గ్రామస్తులంత ఐక్యంగా ఫ్లెక్సీలతో ప్రచారం చేశారు. దీంతో వర్షాకాలం పూర్తయినప్పటికీ గ్రామస్తుల నుండి వ్యతిరేకత ఎదురవుతుందని స్థానిక నాయకులు తాత్కాలిక వంతెనపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం పత్తి పంట చేతికి వస్తుండడంతో రైతులు అమ్ముకోవడానికి వాహనాలు వాగులో వెళ్లక ఇబ్బందులు పడతారని సర్పంచ్‌ జాబరీ అరుణ రవీందర్‌ తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తుల కష్టాలు తాత్కాలికంగా తొలగాయి. తాత్కాలిక వంతెన నిర్మాణంలో ఏఎంసి డైరెక్టర్‌ దంపెల్లి శ్యామ్‌రావు, వార్డు సభ్యులు ప్రవీణ్‌, మోహన్‌, రోజా-రాజు, గ్రామస్తులు మారుతి, రాజన్న, రమేష్‌, దక్షిణామూర్తి, శ్రీకాంత్‌, తిరుమలేష్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు సీస్‌ పరీక్ష

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో గురువారం(సీస్‌) స్టేట్‌ ఎడ్యూకేషన్‌ అచీవ్మెంట్‌ సర్వే పరీక్షను ఆయా పాఠశాలల హెడ్‌ మాస్టర్లు ప్రశాంతంగా నిర్వహించారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష నిర్వహించారు. అనంతరం పరీక్షకు సంబంధించిన ఓఎంఆర్‌, పిక్యూ, టి క్యూ, ఎస్‌క్యూ, ఎఫ్‌ఐలకు సంబంధించిన బండిల్స్‌ను మండల విద్యా వనరుల కేంద్రంలోని అధికారులకు అందజేశారు.

ఎన్నికల వేళ..కొనుగోళ్లు ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

భయానికి కొందరు రైతులు తక్కువ ధరకు దళారులకు, రైస్‌ మిల్లర్లకు అమ్ముతున్నారు. కోసిన రైతులు మరో రెండు వారాలు పడిగాపులు కాయక తప్పని పరిస్థితి కనబడుతోంది. ఎన్నికల బిజీలో ఉంటూ ప్రభుత్వ అధికారులు కొనుగోళ్లపై ఇంకా స్పష్టతకు రానట్టు తెలుస్తోంది. అధికారుల తీరు ఇలా ఉంటే కొనుగోళ్ల వేగవంతం అయ్యేలా చూడాల్సిన అధికార ప్రజాప్రతినిధులు, కొనుగోళ్లపై ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు రైతుల తిప్పలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అసలే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసేందుకు ఫ్లాట్‌ఫామ్‌ లేక పరదాలు కిరాయికి తెచ్చి వాటిల్లో ధాన్యం ఆరబోస్తున్నారు. కొనుగోలు ఆలస్యం అవుతుండడంతో పరదాల కిరాయి వేలల్లో అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలకు చేరని గన్నీ సంచులు

మంచిర్యాల జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.57లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సుమారు 2.15లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి రానుంది. దీని కోసం 260 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అవసరముంది. 54 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంపై అధికారుల అలసత్వం ఉందని రైతులు విమర్శిస్తున్నారు. గన్నీ సంచులు లేకనే కొనుగోళ్లు ప్రారంభించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్‌లో అక్టోబర్‌ నెలలోనే అధికారులు గన్నీ సంచులు సిద్ధం చేసి కొనుగోళ్లకు సన్నద్ధం కావాల్సి ఉంది. ఇప్పటికే నల్గొండ, నిజామాబాద్‌ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఇంకా మొదలు కాకపోవడంతో ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2203 ఉండగా రైస్‌ మిల్లర్లకు రూ.1800కే అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలపై అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే కొనుగోళ్లు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పొలం కోసి 10 రోజులైతాంది.. : లగిశెట్టి తిరుపతి, రైతు, నర్సింగాపూర్‌

ఐదెకరాల్లో ఖరీఫ్‌లో దొడ్డు రకం వరి సాగు చేశాను. పొలం కోసి 10 రోజులైతాంది. రాపల్లి సెంటర్‌లో ధాన్యం ఆర బోశాను. అధికారులు ఇటు వైపు రావడం లేదు. కొనుగోలు ఎప్పుడు జరిపేది చెప్పడం లేదు. వర్షాలు పడే అవకాశం ఉంది. రోజు ధాన్యం ఆరబోయడం, కుప్ప చేయడమే సరిపోతాంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లు జరపాలి.

నవతెలంగాణ
నిర్మల్
శనివారం నవంబర్ 04, 2023

నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం డీగ్రి కళాశాలలో స్వీప్ ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు విద్య, అవగాహనను వ్యాప్తి చేయడం దేశంలో ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడం కోసం భారత ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమమని అన్నారు. దేశంలో ఓటరు అక్షరాస్యతను నిజమైన భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం, అర్హులైన పౌరులందరినీ ఓటు వేయమని ప్రోత్సహించడమని తెలిపారు. ఎన్నికల సమయంలో సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం

నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ మూడవ తేదీ నుంచి నామినేషన్లు ప్రారంభమయ్యాయని ఆన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 244 లొకేషన్‌లలో 305 పోలింగ్ స్టేషన్‌లు, నిర్మల్ నియోజకవర్గంలో 190 లొకేషన్‌లలో 306 పోలింగ్ స్టేషన్లు, అదేవిధంగా ముధోల్ నియోజకవర్గంలోని 230 లొకేషన్‌లలో 311 పోలింగ్ స్టేషన్లు మొత్తం జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాలలో 664 లొకేషన్‌లలో 922 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఈ మూడు నియోజకవర్గాలలో నిర్మల్, ముధోల్ నియోజకవర్గం జనరల్ స్థానాలు కాగా ఖానాపూర్ నియోజకవర్గం మాత్రం ఎస్టీ వర్గానికి కేటాయించబడిందన్నారు. ముఖ్యంగా ఖానాపూర్ నియోజకవర్గం మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్నదని, అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, సిరికొండ, మండలాలు, మంచిర్యాల జిల్లాలోని జన్నారం ప్రాంతాలు మిగిలిన ప్రాంతాలు నిర్మల్ జిల్లాలో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఐదు రోజుల ముందుగానే ఓటర్లకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందించబడతాయని అన్నారు. ఓటర్లు ఓటు వేసేందుకు ఓటర్ కార్డు లేదా ప్రభుత్వం చేత గుర్తించబడిన 12 ధ్రువీకరణ పత్రాలు పాన్ కార్డు ఆధార్ కార్డు డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాస్ బుక్ మొదలగునవి తీసుకెళ్లవచ్చని అన్నారు. ఎన్నికల ఖర్చు నిర్వహణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎస్-ఎస్‌టీఎఫ్, ఎస్‌టీవీఎస్‌టీలు ముమ్మర తనిఖీలు చేపడుతున్నాయని తెలిపారు. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టుల వద్ద పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. సీవిజిల్ యాప్ ద్వారా ఎక్కడైనా ఎన్నికల నియమావళి అతిక్రమన జరిగితే దానికి సంబంధించిన ఫోటోలు వీడియోలు రికార్డు చేసి యాప్‌లో అప్లోడ్ చేస్తే 100 నిమిషాల్లోపు తగిన చర్య తీసుకోబడుతుందని తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్ మీడియా లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ఇవ్వాలంటే కచ్చితంగా ఎంసీఎంసీ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీ చెల్లింపు వార్తల పై నిఘా ఉంచుతుందని అన్నారు. సువిధ ఆప్ ద్వారా ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ర్యాలీలు మీటింగ్‌ల కోసం యాప్‌లోనే అనుమతి కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్ వేసి దానికి సంబంధించిన డబ్బు మొత్తాన్ని చెల్లించవచ్చని అన్నారు. దివ్యాంగుల కొరకు సాక్ష్యం యాప్ ద్వారా పోలింగ్ స్టేషన్ దగ్గర ర్యాంప్ సౌకర్యాలు, మూడు చక్రాల సైకిళ్ల వాహనాలు, సమకూర్చబడతాయని అన్నారు.ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు వారి నేర చరిత కు సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో, నవంబర్ 19 కంటే ముందు ఒకసారి, నవంబర్ 20 నుండి 23 మధ్యన ఒకసారి, నవంబర్ 24 నుండి 28 మధ్యన ఒకసారి మొత్తం మూడు సార్లు ప్రకటించాలని అన్నారు. రాజకీయ పార్టీల ర్యాలీలు, సమావేశాలు పోలింగ్ కు 48 గంటల ముందే నిషేధించబడతాయని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే 2 సీఏపీఎఫ్ బలగాలు వచ్చాయని, వీటితో పాటు మరో 6 సీఏపీఎఫ్ బలగాలు రానున్నట్లు తెలిపారు. ఇప్పటికే అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, అంతర్ జిల్లా చెక్ పోస్టులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్-ఎస్‌టీ,లాంటి టీమ్‌లతో సీఏపీఎఫ్ బలగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలంతా కూడా ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని, పోలీస్ వ్యవస్థ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో తిరుమల, విలేకరులు పాల్గొన్నారు.



బంగారు తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు



నవతెలంగాణ-ఖానాపూర్

బంగారు తెలంగాణను అప్పుల రాష్ట్రంగా బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని మాజీ న్యాయమూర్తి తెలంగాణ ప్రజాస్వామిక వేదిక చైర్మెన్ చంద్రకుమార్, రిటైర్డ్ కలెక్టర్, జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళీ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్యవంతం చేయడం కొరకు, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల చైతన్య యాత్ర" బస్సు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్డు అదుపులేని అవినీతికి పాల్పడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని రూ.5లక్షల కోట్ల అప్పుల పాలు చేసి, తెలంగాణను అత్యంత అవినీతి రాజ్యంగా మార్చారని అన్నారు. అంతేకాకుండా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మత విభజన విద్వేషాలతో బడా సంపన్నులు అయినా అదాని, అంబానీలకు సేవ చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాన్ని సర్వనాశనం చేసిందని తెలిపారు. కల్వకుంట్ల కుటుంబం అధికారంలో ఉంటే ఉద్యోగాలు రావని అన్నారు. మరొక్కసారి కేసీఆర్ అధికారంలోకి వస్తే తెలంగాణ సర్వనాశనం అవుతుందని అన్నారు. తెలంగాణకు అంతులేని అన్యాయం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, తెలంగాణ జల సాధన సమితి కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సమన్వయకర్త నైనాల గోవర్ధన్, పద్మజా, మైనారిటీ నాయకులు మునీరుద్దీన్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నందిరామయ్య, కడెం ఆయకట్టు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు రామకృష్ణ , సీపీఐ(ఎం) నాయకులు నర్సన్న, అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంకుశ్‌రావ్, న్యూడెమోక్రసీ నాయకుడు రాజేష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

- నిర్మల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్

పేదల ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన 18, 19 వార్డుల్లో అయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను ఆయన విస్తృతంగా ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ప్రజలు విస్మరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనతో పాటు అరాచక పాలను అరికట్టాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ రుణం తీర్చు కోవాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి, సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా మా గ్రామాన్ని మున్సిపల్‌లో కలపడం వలన మాకు రావాల్సిన ఉపాధి పథకాలకు దూరమవుతున్నామని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక...

మంజులాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు సమక్షంలో నిర్మల్ జిల్లా ఒడ్డెర సంఘ జిల్లా అధ్యక్షులు సంపంగి ప్రభాకర్, నిర్మల్ నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు వాలకుంట శ్రీనివాస్, శివరాత్రి రవి, అశోక్, నరేష్, పుల్లపు దేవరాజు ఒడ్డెర సంఘ సభ్యులు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే చించొలి, కూరన్నపేట్, రాంనగర్, నాయుడి వాడకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం పట్టణంలోని ఇస్లాంపురా వార్డులోని కామల్‌పురా ప్రార్థన మందిరంతో పాటు అక్షా మజీద్‌లో మైనార్టీలు కలిసి కాంగ్రెస్‌కి మద్దతుగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రజలు ఓటేయ్యాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రజలు అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓటేయ్యాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్(జి), టెంబుర్ని, అంజనితండ, కుస్లీ గ్రామాల్లో నిర్వహించిన, ఇంటింటికి ప్రచారంలో భాగంగా ముందుగా టెంబుర్ని గ్రామంలోని శివాలయంలో, భీమన్న స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమ పథకాలను దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి తండాను గ్రామ పంచాయతీ చేశారని తెలిపారు. అంజనీ తండా గ్రామపంచాయతీగా మారడమే దీనికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ మూడవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ సిలిండర్‌ను రూ.400లకు అందజేస్తామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం ఇస్తామని, రైతుబంధును, ఆసరా పింఛన్లను పెంచుతామని వివరించారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, 24 గంటల కరెంట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేసి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రగతి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని కోరారు. నిర్మల్‌లో గతంలో ఎన్నడు జరుగని అభివృద్ధిని ఈ పదేండ్లలో చేసి చూపించామని, అభివృద్ధి ఆగొద్దంటే కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడబ్ల్యూఆర్ (బాలుర పాఠశాల, కళాశాలలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలు, సైబర్ క్రైం తదితర వాటిపై మహిళ సాధికారత జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అవగాహన కల్పించారు. సఖి కేంద్రం సేవలపై సిబ్బంది నాగమణి వివరించారు. చైల్డ్ లైన్ సర్వీసెస్, చైల్డ్ లేబర్ గురించి, కోఆర్డినేటర్ సతీష్ వివరించారు.

మేనిఫెస్టోలో గిరిజన సమస్యలు చేర్చాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మేనిఫెస్టోలో గిరిజన సమస్యలు చేర్చాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో గిరిజన సమస్యలు చేర్చి వాటికి పరిష్కారాలు ప్రచారాల్లో తెలుపాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న నేటికీ గిరిజన ప్రజల స్థితిగతులు మారలేదన్నారు. పోడు హక్కు పత్రాలు పూర్తిగా అందలేదన్నారు. గిరిజనబంధు ప్రకటించి, ప్రతి కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాల పరిరక్షణపై తమ పార్టీ విధానాలు, గిరిజన తెగల్లో వస్తున్నా అసమానతలపై, ఎస్టీ వర్గీకరణ చేపట్టడంపై తమ పార్టీల విధానము చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన అటవీ సంరక్షణ చట్టం ఆదివాసులను అడవులకు దూరం చేసి అడవులను కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చే చట్టాన్ని వ్యతిరేకించాలని కోరారు. విద్యా, వైద్యం అందక ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ బ్రతుకులు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఫారెస్ట్ అనుమతులు లేక ఆగిపోయిన గిరిజన గ్రామాల రోడ్లు, మంచి నీరు ఇతర సౌకర్యాలు ఎలా పరిష్కరిస్తారో తమ ప్రచారాలలో చెప్పాలని డిమాండ్ చేశారు. తునికాకు బోనస్, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నత విద్యా సౌకర్యాలు వంటివి ఏర్పాటుకు ఏలాంటి హామీ ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గ్రామాభివృద్ధికి తమ పార్టీలు ఏం చేస్తాయో చెప్పి ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు మడవి నాగోరావ్, నాయకులు కనక మల్కు, అర్జున్ మేస్రం మహేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

నవతెలంగాణ-బేల

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని సాంగ్వి, పోతగూడ, జెండగూడ, సైద్‌పూర్, రేణిగూడ, దౌనా తదిత గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డెబ్బై ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేకపోయాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పల్లెల రూపురేఖలు మారాయని తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలను దిగ్విజయంగా ప్రజలకు చేరవేస్తూ సామాన్యులకు భరోసా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారికి అన్ని విధాలా అండగా నిలబడుతున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. ఆర్థిక సంపదను సరైన రీతిలో నిరుపేద, సామాన్య ప్రజలకు అందించి, వారి అభ్యున్నతికి అహర్నిశలు పాటు పడుతున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాల్లో కనీస వసతులు అందుబాటులో లేక తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారని అన్నారు. సరైన రోడ్లు సదుపాయం, తాగునీరు వసతి లేక వ్యాధుల బారిన పడేవారని అన్నారు. ప్రస్తుతం పల్లెల్లో ఆ పరిస్థితి లేదని, పదేండ్ల కాలంలో గ్రామాలు గణనీయ పురోగతి సాధించాయని స్పష్టం చేశారు. రైతులకు, మహిళలకు, వృద్ధులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న కారు గుర్తు పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, పార్టీ మండల అధ్యక్షులు ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, ఎంపీటీసీ కిష్టు, నాయకులు గంభీర్ ఠాక్రే, దేవన్న, చరణ్‌దాస్, రోహిదాస్, దత్తు, వసంత్, ఇంద్రశేఖర్, విపిన్, తేజ్‌రావ్ వాడ్కర్, సంతోష్ భేదోడ్కర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాల విద్యార్థి ఎంపికైంది. ఈనెల 5 నుంచి 11 వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జాతీయ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.సాక్షి పాల్గొంటుందని గిరిజన క్రీడాల అధికారి బండ మీనారెడ్డి, క్రీడ పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావ్ తెలిపారు. అక్టోబర్ 14 నుండి 17 వరకు వరంగల్‌లో జరిగిన సౌత్ జోన్ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయ రికార్డును నమోదు చేసిందన్నారు. మరోసారి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులకు అత్యున్నత శిక్షణ ఇస్తున్నామని, వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. అథ్లెటిక్ శిక్షకుడు విద్యాసాగర్, సాక్షిని డీటీడీఓ రమాదేవి, ఏసీఎంఓ పీ.ఉద్ధవ్, ఏటీడీఓ



క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, పాఠశాల శిక్షకులు అరవింద్, తిరుమల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అధిక ఫీజుల సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థుల నుంచి ముక్కుపిండి మరీ ఫీజులను వసూలు చేస్తున్న సర్క్యులర్ వెనుకకు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడాం సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థుల నుంచి ముక్కుపిండి మరీ ఫీజులను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు, రెండో, మూడో సంవత్సర విద్యార్థులకు విద్యార్థి గుర్తింపు ఫీజు, విద్యార్థి సంక్షేమ నిధి, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజుల పేరుతో ఇష్టారీతిన ఫీజులను పెంచేశారని ఆరోపించారు. గతంలో కంటే కూడా మూడు రెట్లు ఫీజులు పెంచారని అన్నారు. ఫీజుల పెంపు చర్యను ఖండిస్తున్నామని, పెంచిన అన్ని రకాల ఫీజుల యూనివర్సిటీ సర్క్యులర్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో విద్యార్థి రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు, విద్యార్థి గుర్తింపు ఫీజు, విద్యార్థి సంక్షేమ నిధి, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజులు మొత్తం కలిపి సుమారు రూ.900 వరకు ఉండేదని కానీ, ఆయా ఫీజులను ఇప్పుడు రూ.2500కు పెంచారన్నారు. రూ.1600 విద్యార్థులపై అదనపు భారం మోపారని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు విద్యార్థుల ఆర్థిక స్థోమత గురించి ఆలోచించకుండా ఫీజులు పెంచడం సరికాదన్నారు. ఇటువంటి చర్యలతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతారని వారు పేర్కొన్నారు. తక్షణమే పెంచిన ఫీజు సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అశోక్, రవీందర్, రవి, వినోద్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రెబ్బెన

అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్న బీఆర్ఎస్‌కే మరోసారి పట్టంకట్టాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పర్యటిస్తూ పార్టీ అభ్యర్థి కోవలక్ష్మిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలతో కూడిన కరపత్రాలను అందిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రచారంలో విశేష ప్రజాధరణ లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు దేశం దృష్టిని ఆకర్షించేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, ఫ్యాక్స్ ఛైర్మెన్ కార్నాదం సంజీవ్, వైస్ ఛైర్మెన్ రంగు మహేష్, కుందారపు శంకరమ్మ, దుర్గం రాజేష్, ఎంపీటీసీ ఓల్వోజు హరిత, ఓల్వోజు వెంకటేశం చారి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-బోథ్

పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదిలాబాద్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు పాచిపెంట శాంతి కుమారి అన్నారు .శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ గ్రామ గ్రామాలలో వీధుల గుండా 6 గ్యారంటీలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి సమిష్టి కృషి చేయాలని సూచించారు. అధికారంలోకి రాగానే ప్రజలకు అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నాయకుల మనోభావాలను గుర్తించి అందరూ ఒకే వేదికపై వచ్చి పనిచేద్దామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలు పక్క రాష్ట్రం కర్ణాటకలో బ్రహ్మాండంగా అమలు చేస్తున్నారని అన్నారు. వాటిని ఓర్చుకోలేక ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో



కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బోథ్ అసెంబ్లీ ఎన్నికల సమన్వయకర్త తుల అరుణ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, జిల్లా కిసాన్ సెల్ చైర్మెన్ మెరుగు మల్లేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మల్లెపూల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు నల్ల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మహమూద్, షేక్ నాజర్ అహ్మద్, రజియా బేగం, పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, సీహెచ్ మహేందర్ పాల్గొన్నారు.

సామర్థ్యాలు తెలుసుకోవడానికి విద్యాసాధన పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకొనుటకు విద్యాశాఖ నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పార్సీ అశోక్ అన్నారు. శుక్రవారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల, జనకాపూర్‌లోని జిల్లా పరిషత్ పరిషత్ పాఠశాల, సరస్వతి శిశుమందిర్‌లలో నిర్వహించిన సర్వే పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో 461 పాఠశాలలు, 509 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలను ఏ మేరకు సాధించబడ్డాయో తెలుసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ మధుకర్, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- కోనేరు ఛారిటబుల్ ట్రస్టు చైర్మెన్ కోనేరు వంశీ

నవతెలంగాణ-దహెగాం

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ కోనేరు వంశీ అన్నారు. శుక్రవారం మండలంలోని బామానగర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను మరోసారి గెలిపిస్తే గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, నాయకులు దందెర వెంకన్న, పాపయ్య డుబ్బుల దిలీప్, కంబగోని వెంకటేశ్‌గౌడ్, రామన్న, పోశన్న పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం..



నవతెలంగాణ-తలమడుగు

బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ .జాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అనిల్ అన్న సైన్యం సభ్యులు అన్నారు. శుక్రవారం మండలంలోని లచ్చంపూర్, పల్లి(బి)లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. అనిల్ జాదవ్ గెలుపు కోసం కొంతమంది యువకులు స్వచ్ఛందంగా చెప్పులు ధరించకుండా ప్రచారంలో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటేష్, ముడుపు కేదారీశ్వర్‌రెడ్డి, కిరణ్ కుమార్, కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, దేవన్న, రాకేష్, శాస్త్రి, అబ్దుల్లా, మల్లేష్, రమకాంత్, రమేష్, రాజేశ్వర్, గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతగా సక్రమంగా నిర్వహించుటకు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్), ఇచ్చోడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అక్టోబర్ 30, 2023 నుంచి నవంబర్ 01, 2023 తేదీలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కొందరు సరైన కారణం లేకుండా, ఉద్యేశ పూర్వకంగా గైర్యాజరయినందున వారికి షోకాజు నోటిసులు ఇవ్వడం జరిగిందని, శాఖ పరమైన చర్యలు కూడ తీసుకోబడునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉండం, డోర్లి, సుంకిడి గ్రామాలకు చెందిన యువకులు, పలువురు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొమ్మిదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు అన్ని రంగాల్లో మోసపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా సైనికులుగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రచార కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ రాజేశ్వర్, ప్రకాష్‌రావు, ఉశన్న, కిష్టరెడ్డి, అలకుంట్ల రాజమల్లు, సంతోష్, బాబన్న, ప్రకాష్‌రావు, గంగారాం సర్పంచ్, నవీన్‌రెడ్డి, వెంకన్నయాదవ్, విలాస్ యాదవ్, పోతన్న, రాంచందర్ దేశ్‌ముఖ్, ప్రమోద్, ఫరూక్, గణేష్, ప్రెసిడెంట్, శ్రీనివాస్ రెడ్డి, సుభాష్, లింగన్న, రవి, వామన్‌రావు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బోథ్ ఎంపీటీసీ కాంగ్రెస్‌కు రాజీనామా

నవతెలంగాణ-బోథ్

బోథ్ ఎంపీటీసీ కుర్మె మహేందర్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధిష్టానానికి అందించినట్టు తెలిపారు. త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు సమాచారం.

రిమ్స్ మార్చురీ వద్ద ఉద్రిక్తత

● బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన ● నిరసనకారులు అరెస్ట్



ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్ మండలం భోరజ్ గ్రామంలో రమాకాంత్ ది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులు ఆరోపించారు. శుక్రవారం దీనికి బీఆర్ఎస్ సర్కారే బాధ్యత వహించాలంటూ రిమ్స్ మార్చురీ ఎదుట ఆందోళనకు దిగారు. అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బాధిత కుటుంబీకులకు అండగా బీఎస్పీ, బీజేపీ నాయకులు మార్చురీ ఎదుట నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, డీఎస్పీ ఉమెందర్ రంగప్రవేశం చేశారు. వారిని సముదాయించేందుకు ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. దళితబంధు రాకపోవడంతోనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, సీఎం కేసీఆరే తన చావుకు కారణమని సూసైడ్ నోట్ రాశారని అన్నారు. భోరజ్ గ్రామానికి చెందిన దళిత యువకుడు రమాకాంత్ (26) పురుగులమందు తాగి అఘాయిత్యానికి పాల్పడటం దురదృష్ట కరమని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి కాకుండా పాలకులు చెప్పిన వాళ్లకే సంక్షేమ పథకాలు అమలు చేయడంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని, రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రావాలని న్యాయం చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే మృతదేహంతో నామినేషన్ సెంటర్ వద్దకు నిరసనకారులు వెళ్తామనడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్పీ వారిని అరెస్ట్ చేయమని ఆదేశించారు. దీంతో నాయకులకు నిరసన కారులకు తోపులాట జరుగగా తీవ్ర ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అనంతరం వారిని పోలీస్ వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. బాధిత కుటుంబీకులు బీఎస్పీ నాయకులు అక్కడి నుండే కదలలేదు. చివరగా అధికారులు కలెక్టర్‌కు ఫోన్ చేసి బాధితులతో మాట్లాడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, కోడ్ ముగిసిన కుటుంబానికి న్యాయం చేస్తామని హామినివ్వడంతో ఆందోళన విరమించారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతాం : ఎస్పీ

బోరజ్ గ్రామానికి చెందిన రమాకాంత్ అనే వ్యక్తి కూలీ పని చేసుకుంటూ ఉంటాడని గురువారం అనుమానాస్పదంగా రోడ్డుపై చనిపోయి ఉన్నాడని అనుమానంతో ఆత్మహత్య చేసుకున్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిగా దర్యాప్తు చేపడుతామని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయేమో అన్న కోణంలో దర్యాప్తు చేపడుతుమన్నారు. చనిపోయే ముందు ఎవరెవరితో మాట్లాడాడు. ఆ సూసైడ్ నోట్ రాత ఎవరిదో అన్ని విషయాల పట్ల దర్యాప్తు చేపట్టి మరణానికి గల కారణం తెలుసుకుంటామన్నారు.

దశ వాగ్దానాలతో డీఎస్పీ మేనిఫెస్టో విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

దశ వాగ్దానాలతో కూడిన ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) మేనిఫెస్టోను ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ శుక్రవారం పార్టీ కార్యాలయంలో లాంచనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో, ఆదిలాబాద్ నియోజకవర్గంలో 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల జీవితాలలో సామాజిక ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పుకోసం దశ వాగ్దానాలతో కూడిన మేనిఫెస్టోను విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతి ఏటా 33 వేల కోట్ల బడ్జెట్‌తో ఆధునిక విద్యా విధానంతో కేజీ టు పీజీ ఉచిత విద్య , ఉచిత వైద్యం, ఆరోగ్య భీమా ఉంటుందని తెలిపారు. ప్రతియేటా 33 వేలకోట్ల బడ్జెట్‌తో ఉపాధి వ్యవస్థ నిర్మాణం, పేద రైతులకు జీతాలు, చిన్న, సన్నకారు, కౌలు రైతులకు ప్రతినెల రూ. 5వేల భృతి బ్యాంకు అకౌంట్లోకి జమ చేస్తామన్నారు. ప్రతి మండలంలో దళితులకు ప్రత్యేక పోలీస్ స్టేషన్, ఇల్లు లేని పేదలందరికీ నాలుగదుల ఇల్లుని నిర్మిస్తామన్నారు. భూమిలేని నిరుపేదలకు సాగునీటి సౌకర్యం ఉన్న ఒక ఎకరం భూమిని పంపిణీ చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఒకే చోట 25వేల షాపుల కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. సంపూర్ణ మద్యనిషేదం, ప్రయివేట్ రంగంలో బీసీ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లులు కల్పిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ సభ్యులు గంగన్న, పవన్, రాజీవ్, రవి, సంతోష్, తిరుపతి, నవీన్, సురేష్, సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాయకులు

మంథని-చెన్నూర్ మధ్య బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-జైపూర్

మంథని – చెన్నూర్ మధ్య శివ్వారం మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని శివ్వారం గ్రామ సర్పంచ్ ఆవిడపు గణేష్ కోరారు. శుక్రవారం మంథని ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శివ్వారం గ్రామానికి మంథని అతి దగ్గరగా ఉన్నందున ప్రతి అవసరానికి గ్రామస్తులతోపాటు వేలాల, పౌనూర్, కిష్టాపూర్ గ్రామాల వారు పార్వతి బ్యారేజ్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ పట్టణాలకు చేరుకోవడానికి మంథని మీదుగా ప్రయాణించడం ఆర్థికంగా ప్రయోజనం ఉండటంతో పాటు సమయాభావం కలిసి వస్తుందని తెలిపారు. ఆర్టీసీకి ఆదాయం సమకూరడంతో పాటు రవాణా వ్యవస్థ మెరుగవుతుందని పేర్కొన్నారు. గతంలో కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరామని, ఇప్పటికైనా ఈ విషయంలో స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివ్వారం సర్పంచ్ ఆవిడపు గణేష్

కోవ లక్ష్మి అభ్యర్థిత్వాన్ని ఆదివాసులు బలపరచాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసి ఓటర్లు ఎక్కువున్న ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మిగతా పార్టీలు ఆదివాసీలకు టికెట్లు కేటాయించలేదని, బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి అభ్యర్థిత్వాన్ని ఆదివాసీలు ఐక్యతతో బలపరచాలని కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్ ఆదివాసీ భారత్ మహాసభ సెంట్రల్ కమిటీ నాయకుడు పెందూర్ రాజేష్ కోరారు. శుక్రవారం స్థానికంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఆదివాసీ మహిళకు టికెట్‌ను కేటాయించడంలో అన్యాయం చేసిందనీ, ఆదివాసి ముద్దుబిడ్డ కోవలక్ష్మీని ఆదివాసులు కలిసి గెలిపించాలని కోరారు. ఆమె వల్లనే ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురం భీం పేరుతో జిల్లా ఏర్పడిందన్నారు. దాన్ని గుర్తుంచుకొని ఆమెకి ఓటు వేయాలన్నారు. ఎన్నికల్లో భాగంగా ఈనెల 8న జిల్లా కేంద్రానికి వస్తున్న ముఖ్యమంత్రి సభకు ఆదివాసీలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలోఆదివాసీ భారత్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గేడం నగేష్, మడావి బాలు, రామ్ చందర్, గంగారం, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో సుస్థిరత సాధ్యం

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో సుస్థిరత సాధ్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి అన్నారు. మండలంలోని బూరుగుడ గ్రామానికి చెందిన యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 50 సంవత్సరాల నుండి జరగని అభివృద్ధి 9 సంవత్సరాల్లో జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఇవ్వాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు అధికారంలోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. మరోసారి తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నామినేషన్‌లు సకాలంలో దాఖలు చేయాలి

● రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు సకాలంలో నామినేషన్‌లు దాఖలు చేయాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లను ఆయన స్వీకరించారు. తొలి రోజు కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ తన సతీమణితో కలిసి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం 10వ తేదీలోగా మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ దాఖలు చేయాలన్నారు. 13న రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పరిశీలన ఉంటుందని, 15న ఉపసంహరణ ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని, నామినేషన్ స్వీకరణ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో అభ్యర్థితో కలిసి ఐదుగురికి అనుమతి ఉంటుందన్నారు. మూడు వాహనాలు అనుమతి ఉంటుందని, ఒక అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చని, అత్యధికంగా రెండు ప్రాంతాల్లో పోటీ చేయచ్చని తెలిపారు.

ఆసిఫాబాద్ : అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా పోటీ చేసే అభ్యర్థులు సకాలంలో నిర్దేశించిన నమూనాలో నామినేషన్లు దాఖలు చేయాలని ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దాసరి వేణు తెలిపారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణలో ఆయన పాల్గొన్నారు. తొలిరోజు ఒక్క నామినేషన్ కుడా దాఖాలు కాలేదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయిందని, పదవ తేది లోపు పోటీ చేసే అభ్యర్థులు మధ్యాహ్నం మూడు గంటల వరకు తమ నామినేషన్లను దాఖలు చేయాలని సూచించారు.



సిర్పూర్(టి)లో నామినేషన్లను స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ

ఎక్సైజ్ అధికారుల దాడులు



నవతెలంగాణ-చింతలమానపల్లి

మండలంలోని లంబాడిహోట్టి గ్రామంలో నాటు సారా స్థావరంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో 15 లీటర్ల నాటుసారా, తయారికి వినియోగించే 160 కేజీల పటిక, 250 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. జర్పుల మంగా భాయ్, అజ్మీరా గోపీభాయ్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ మంగమ్మ తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై స్వాతి, కిషన్, కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవకుడిగా వచ్చా.. ఆదరించండి

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యామ్ నాయక్



కెరమెరిలో కండువ కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్యామ్ నాయక్

నవతెలంగాణ -కెరమెరి

జిల్లా రవాణా శాఖ అధికారిగా పనిచేసి స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి ప్రజా సేవకుడిగా వచ్చానని కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో రెండు దఫాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలించినప్పటికీ పేద, మధ్యతరగతి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చి హామీలను విస్మరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి రాజకీయ సమాధి తప్పదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకులు ఎన్నికల ప్రచారంలో గ్రామానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. రాష్ట్రంలో సమన్యాయ పాలన రావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం ఆయన సమక్షంలో బీజేపీ నాయకులు చేరారు. కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుసుం రావ్, ఎల్లప్ప, రజాక్, ఆత్రం లక్ష్మణ్, రాథోడ్ శంకర్ నాయక్, చరణ్, ముఖీత్, గుండా శ్యామ్, అసిఫ్, బాబు నాయక్, సుదే గొనె వార్ వెంకటి గౌడ్, సాగర్, గోపి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రెబ్బెన మండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యామ్‌నాయక్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్‌తో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. యువతను నిండా ముంచిందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. అధిక మెజారిటీతో పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్, రమేష్, రాజు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 6 నుండి జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలో గల టాస్క్ రీజినల్ సెంటర్‌లో ఐదు రోజులపాటు జరిగే పారిశ్రామిక సంసిద్ధత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాసిటికల్స్, వ్యవసాయం తయారీ వంటి విభిన్న రంగాలతో వేగంగా అభివృద్ధి చెంది ఆర్థిక వ్యవస్థలో ఎలా ఎదగాలో అనే అంశాలపై పారిశ్రామిక సంసిద్ధత శిక్షణ ఉంటుందన్నారు. దీనితో పాటు బెసిక్ ఐటీ నైపుణ్యాలతో పాటు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. యువత ఇలాంటి శిక్షణా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటు మరింత ఉన్నంతంగా రాణజంచాలని ఆకాంక్షించారు. మరిన్ని వివరాలకు ఈ నెంబర్ 9502786438 ను సంప్రదించగలరని అన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వండి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ ఇచ్చి అధికారాన్ని ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రిటర్నింగ్ కార్యాలయంలో ఆయన సతీమణి రావి సునీతతో కలిసి నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నాపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గెలిచిన అనంతరం మెనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీ పథకాలను ఖచ్చితంగా నియోజకవర్గంలో అమలుచేస్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందేవని, రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం చేస్తున్న స్కాంలు మరే ముఖ్యమంత్రి చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిధులను కుటుంబ సభ్యులు, అనుచరులకే దక్కుతున్నాయన్నారు. ఏ గ్రామంలో చూసిన ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అన్ని సామాజిక వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షకిల్ హైమద్, నాయకులు ఉన్నారు.



నామినేషన్ అనంతరం మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

గిరిజన విద్యార్థుల వికాసానికి ప్రయత్నించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యార్థుల వికాసానికి ప్రయత్నించాలని, స్కూల్ కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్‌ల పాత్ర కీలకమని గిరిజన సంక్షేమ శాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి పూర్క ఉద్ధవ్ అన్నారు. శుక్రవారం పీఎంఆర్సీలో ఎస్సీఆర్పీల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యా వికాసానికి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సమయాలను పాటించాలన్నారు. కృత్యధార భోదన పద్ధతి ద్వారా విద్యను అందించాలన్నారు. మార్గదర్శల ఆధారంగా స్కూల్ గ్రాంట్ వినియోగించాలని, ఇన్సెంటివ్ సకాలంలో అందించాలన్నారు. మధ్యాహ్నం భోజనం, ముఖ్యమంత్రి అల్పాహార పథకం సంక్షేమ పాఠశాలలో అమలు చేయాలన్నారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అద్దె వాహనాల కోసం దరఖాస్తుల

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో వివిధ గనులు, డిపార్టుమెంట్లలో యూనిట్ రేట్ సిస్టమ్ ప్రకారం అద్దె ప్రాతిపదికన మూడు సంవత్సరాల పాటు వినియోగించేందుకు ఎనిమిది 2 డబ్ల్యుడీ, 4 డబ్ల్యుడీ(వీల్‌డ్రైవ్) వాహనాల కోసం టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. భూ నిర్వాసితుల కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, తేదీ 9న సాయంత్రం 4 గంటలలోపు అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం గోలేటిలోని జీఎం కార్యాలయంలోని పర్చెస్ డిపార్టుమెంటులో లేదా వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం నవంబర్ 4, 2023

అడవిపంది దాడిలో వ్యక్తికి గాయాలు

పెంచికల్‌పేట్ : మండలంలోని కొండపెల్లి గ్రామానికి చెందిన రైతు మేకల వెంకయ్య అడవిపంది దాడిలో గాయపడ్డాడు. శుక్రవారం అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మేకల వెంకయ్య రాత్రి వరి పంట పొలానికి కాపలాకు వెళ్లాడు. తెల్లవారు జామున పొలంలో అలజడి అవ్వడంతో అక్కడ చూడగా అడవిపంది ఒక్కసారిగా దాడిచేసింది. దాడిలో గాయాలపాలైన వెంకయ్యను కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి అటవీ శాఖ అధికారులు వెళ్లి పంచనామా నిర్వహించారు.

జ్వరంతో యువకుడి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలం చింతగూడ గ్రామానికి చెందిన అనుముల నరేందర్(25) తీవ్ర జ్వరంతో మృతిచెందాడు. భార్య శ్రీవల్లి తెలిపిన వివరాల ప్రకారం కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జ్వరం కారణంగా శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె పేర్కొన్నారు. నరేందర్ మరణంతో చింతగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ గెలిస్తే కౌలు రైతులకు పెట్టుబడి సాయం

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ గెలిచిస్తే కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సిరంగి శంకర్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కౌలు రైతుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రైతుబంధు పథకాన్ని భూస్వాములకు వర్తింపజేసి ప్రభుత్వ ధనాన్ని దుబార చేసిందని ఆరోపించారు. తెలంగాణలో 60 శాతం మంది రైతులు కౌలు వ్యవసాయం చేస్తున్నప్పటికీ వారిని గుర్తించలేదన్నారు. బీజేపీ నాయకులు భాస్కర్ గౌడ్‌తో పాటు రేచినికి గ్రామానికి చెందిన రాంబాయి, వెంకటేష్, బురుస పోశం, మండల ఉపాధ్యక్షులు ఆనంద్ సోమయ్య, గడ్డం వెంకటేష్ గౌడ్, పలువురు యువకులతో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండి ఈసా, గట్టు మురళీధర్ రావు, సూరం రవీందర్ రెడ్డి, మాసాడి తిరుపతి పాల్గొన్నారు.



కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గడ్డం వినోద్

చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన డీసీపీ

నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను డీసీపీ సుదీర్ కేకన్ తనిఖీ చేశారు. వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించడంతో పాటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చెక్ పోస్టులు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. అక్రమ మార్గంలో మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభ పెట్టే వస్తువులను రాకుండా వివిధ శాఖల సమన్వయంతో 24 గంటల పర్యవేక్షణలో చెక్‌పోస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీసీపీ వెంట మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, కాసిపేట ఎస్సై గంగారం ఉన్నారు.



నేడు కార్మికుల వేగు చుక్క వీటీ అబ్రహం వర్ధంతి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ

నవతెలంగాణ-మందమర్రి

కార్మికుల వేగు చుక్క వీటీ అబ్రహం వర్ధంతిని శనివారం నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలెంద్ర సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మందమర్రి ఏరియా ఏఐటీయూసీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 4న కార్మికుల వెగు చుక్క వీటీ అబ్రహం 39వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రేణులు ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్మికుల హక్కుల కోసం చివరి శ్వాస వరకు భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. దుండగుల చేతిలో హత్యకు గురై అమరుడైన అబ్రహం పోరాట పటిమ త్యాగం, ఆదర్శప్రాయమని అన్నారు. శనివారం ఏరియాలోని గనుల డిపార్ట్‌మెంట్‌లలో అబ్రహం వర్ధంతిని ఘనంగా జరుపుకోవాలని సూచించారు. సాయంత్రం 4 గంటలకు కార్యాలయం నుండి అబ్రహం స్థూపం వరకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ భీమనాదుని సుదర్శన్, సంయుక్త కార్యదర్శి కంది శ్రీనివాస్, ఏరియా నాయకులు బాణయ్య, సుదర్శన్ రెడ్డి, ఫిట్ కార్యదర్శులు శర్మ, కుమార్, రాజేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం మరో అవకాశం ఇవ్వండి



నవతెలంగాణ-దండేపల్లి

వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం తథ్యమని మూడోసారి కూడా అధికారం బీఆర్ఎస్‌దేనని, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే దివాకర్ రావు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. పార్టీ చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. తాము చేసిన అభివృద్ధి పనులే వచ్చే ఎన్నికల్లో పార్టీకి విజయం అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వ సమితి జిల్లా కన్వీనర్ మోటపలుకుల గురువయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైస్సార్ టీపీకి ఎస్టీ సెల్ అధ్యక్షుడి రాజీనామా

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి వైస్సార్ టీపీ నియోజకవర్గ అధ్యక్షుడు భూక్యా సాయి పున్నం తమ పదవీకి రాజీనామా చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వైఎస్సార్ టీపీ ఆలోచనలు, క్యాడర్‌ను పట్టించుకోకపోవడం, పని చేసినా గుర్తించడం లేదన్నారు. 3 సంవత్సరాలుగా చేసినా సేవలను గురించకపోవడం వలన పార్టీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో ప్రజల అభిప్రాయం మేరకు భవిష్యత్ కార్యాచరణను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీర నరేష్, అజ్మీర కుమార్, బదావత్ కిరణ్, రమేష్, భూక్య కిరణ్, అజ్మీర నరేష్, రమేష్, బానోత్ వినేష్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా అన్నారు. శుక్రవారం మండలంలోని అక్కపెల్లిగూడ, మన్నెగూడ గ్రామాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు పార్టీ అమలు చేసే ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండాలని అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మత్ ఖాన్, అజ్మీరా అఖిల్, రాకేష్, సాయి నాయక్, రఘువర్ధన్, సుమిత్, గణేష్, తరుణ్, బన్నీ, రాజేష్, నాగరాజు, సైపుల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

గడపగడపకు బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-భీమారం

మండలంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ శుక్రవారం గడప గడప ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా మండల కేంద్రంలోని లక్ష్మీ దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెనుగువాడ, ఎస్సీ కాలనీ, లంబాడి తండాలో ప్రచారం చేశారు. పార్టీ మేనిఫెస్టోను తెలియజేస్తూ కరపత్రాలను అందించారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ, అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో మరింత అభివృద్ధి జరుగుతుందని బాల్క సుమన్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు సర్వోత్తం రెడ్డి, కలగూర రాజ్‌కుమార్, సర్పంచ్ గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి చదువులో రాణించాలి

నవతెలంగాణ-కోటపల్లి

ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించాలిని డీఈఓ ఎస్.యాదయ్య అన్నారు. శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలను మండలంలోని పారుపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించగా ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం గుండేటి యోగేశ్వర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఇష్టంగా చదువుకొని గొప్పగా ఎదగాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికి హెచ్‌ఎం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓకు మొక్కను బహుకరించారు. ఆయన వెంట ఎంఈఓ తిరుపతిరెడ్డి, ఎంఎన్ఓ మొగిలి ఉన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని సీఎస్ఐ రైడల్ పాఠశాలలో స్టూడెంట్ అచీవ్‌మెంట్ పరీక్షను నిర్వహించారు. స్టూడెంట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్‌లో భాగంగా అభ్యసన సామర్థ్యలపై పరీక్ష జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ ఎస్. డేవిడ్ పాల్ తెలిపారు. ఇంగ్లీష్, గణితంలో పిల్లలకు ఉన్న అవగాహన, కనీస అభ్యసన సామర్థ్యాలు ఎంత స్థాయిలో ఉన్నాయో తెలుసుకునే ఉద్దేశంతో పరీక్ష జరిగిందన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు కూడా అభ్యసన సామర్థ్యాలపై పరీక్ష కొనసాగినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

నవతెలంగాణ-దండేపల్లి

బీఆర్ఎస్ నుండి ఇటు కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బొమ్మన గంగాధర్, బొలిశెట్టి గంగన్న, కాసిపెట గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు జిల్లపెల్లి సుజాత, కార్యకర్తలు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. అటూ అల్లిపూర్ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రాజయ్య బీజేపీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీ విధానాలను నచ్చకనే ఇతర పార్టీలోకి వలస వెళ్తున్నామని చెబుతున్నారు.

భవిష్యత్తును నిర్ణయించే ఆయుధం ఓటు

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

నవతెలంగాణ-జన్నారం

ప్రజస్వామ్యంలో ఓటు తమ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఎన్నికల్లో తమ ఓటును సరైన వారిని ఎన్నుకునేల వినియోగించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జీ జస్టిస్ బి.చంద్రకుమార్, రిటైర్డ్ కలెక్టర్ ఆత్నూరి మురళీ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక జాగో తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మద్యం, నోటు, కులానికి, మతానికి లోబడకుండా ఓటు వేయాలన్నారు. అవినీతి నియంతృత్వంతో దోపిడీ చేస్తున్న వాళ్లను ఓడించాలని పిలుపునిచ్చారు. నీళ్ల, నిధులు, నియామకాలు అని చెప్పి తెలంగాణను మోసం చేసిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కడెం ఆయకట్టు కింద ఉన్న జన్నారం, దండేపల్లి, హాజీపూర్, మంచిర్యాల మండలాల రైతులకు రెండు పంటలకు నీరు అందించాలన్నారు. కడెం ప్రమాదంలో ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, పంటలకు భీమా, దళితులకు మూడెకరాల భూమి, దళిత బందులో రూ. పది లక్షలు, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా మోసం చేసి మరోసారి ఓట్లు అడగడానికి వస్తున్న పార్టీలను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా వేదిక కన్వీనర్ వినాయక రెడ్డి, జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, సమన్వయకర్త కృష్ణ ప్రసాద్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి రాష్ట్ర నాయకులు నంది రామయ్య, మిక్కిలినేని రాజశేఖర్, సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి, కనికారం అశోక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ముత్యం రాజన్న, దుర్గం అమృత రావు ముజ్జు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన జరుగునున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్పి సురేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30న పోలింగ్ అనంతరం డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని, డిసెంబర్ 5వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కొరకు పూర్తి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈవిఎం, వివి ప్యాట్లను భద్రపరిచేందుకు కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు కలిపి ఒకే కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్పి వెంకటరమణ, కలెక్టరేట్ ఏఓ రహతుల్లా, ఎన్నికల విభాగం అధికారులు మధుకర్, జితేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్టు జెడ్పీ వైస్ ఛైర్మెన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మొట్లగూడ, ఎర్రగుంట గ్రామాల్లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగుంట, మొట్లగూడ గ్రామానికి చెందిన బీఎస్పీ, బీజేపీల నుండి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపతి, సర్పంచులు చంద్రమౌళి, శ్రీనివాస్, రాజన్న, కోరె కళావతి, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు రాజన్న, నరసింగరావు, దెబ్బటి మహేష్, చౌదరి బండన్న, బాపురావు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న గ్రామస్తులు

'భూమి కోసం బెదిరుస్తున్నారు'

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం లంబాడితండా-కే గ్రామంలో మా భూమి కోసం బెదిరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మామిడిగూడంకు చెందిన బానోత్ తులసి రాం కోరారు. గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సోమగూడెం-కే గ్రామ పరిధిలో 146/14 సర్వే నెంబర్‌లో భూమి ఉందని, మేము ఆ భూమిని మా తాత, ముత్తాతల నుండి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కుటుంబ తగాదాల కారణంగా కోర్టులో వ్యవహరం ఉందన్నారు. గ్రామ అభివృద్ధి, సేవాలాల్, పోచమ్మ గుడికి, క్రీడా మైదానం, జీపీ భవనానికి తమ స్థలాన్ని ఇచ్చామన్నారు. మిగిలిన భూమిని చదును చేసుకొని జీవిస్తున్నామన్నారు. భూ వివాదం కేసు కోర్టులో నడుస్తుండగా కొంతమంది తన వద్దకి వచ్చి భూమి లేదా రూ. ఐదు లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నారన్నారు.



బీఆర్ఎస్‌ని మూడోసారి దీవించాలి

- కోవ లక్ష్మిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- సిర్పూర్(యూ) జెడ్పీటీసీ కోవ అరుణ

నవతెలంగాణ-నార్నూర్

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు మూడోసారి దివించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి తనయురాలు సిర్పూర్(యూ) జెడ్పీటీసీ కోవ అరుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం చేశారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి మేనిఫెస్టోను వివరించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి విజయం కోసం కృషి చేయాలని కోరారు. ముందుగా ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతుగా మండలంలోని భీంపూర్, గణేష్‌పూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపిద్దామని అన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలను కెసీఆర్ ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావ్, పీఏసీఎస్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, ఎంపీటీసీ పరమేశ్వర్, మాజీ జెడ్పీటీసీ రూపవతి జ్ఞానోబా పుష్కర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రూప్‌దేవ్, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, నాయకులు సయ్యద్ ఖాసిం, నాయకులు కనక ప్రభాకర్, భీంపూర్ సర్పంచ్ విష్ణు, ఎంపీటీసీ రేణుక దిలీప్, మాజీ ఉపసర్పంచ్ దాదే అలీ, కోర్రాల మహేందర్, సుభాష్ రాథోడ్ పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని పూసిగూడ గ్రామం రోడ్డుపై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో అదుపు తప్పి పడిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణప్రాయ స్థితిలో కొట్టు మిట్లాడుతున్నాడు. ఆ వైపుగా వెళ్తున్న తాడిహత్నూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ సంతోష్ సంఘటనను గమనించాడు. చూసిన వెంటనే 108 అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్నాడు. దీనితో తోటి మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి : తుల శ్రీనివాస్

నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వ సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాకెర, కనుగుట్ట, కుచులాపూర్, గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాల ఆదుకొని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అన్నారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ గెలుపు ఖాయమని అన్నారు. అనంతరం సొనాల గ్రామపంచాయతీలో గడపగడపకు బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ అభివృద్ధిని చూపిస్తూ, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశాన్ని మాకు కల్పించాలని కోరారు. నమ్మకంతో మీ ముందుకు వచ్చి ఓట్లు అడిగే హక్కు కేవలం బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్, కదం ప్రశాంత్, నాయకులు అల్లకొండ ప్రశాంత్, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

అన్న గెలుపు కోసం తమ్ముని ఆరాటం

నవతెలంగాణ-తాంసి

బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపుకోసం తన తమ్ముడు ధనరాజ్ జాదవ్ శుక్రవారం మండల కేంద్రంలోని మండల నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లకు తెలియజేస్తు కారు గుర్తుకు ఓటు వేసి అనిల్ జాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, కన్వీనర్ అరుణ్, నాయకులు శ్రీదర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కాంతరెడ్డి, కళ్యాణ్, శ్రీనివాస్, దేవిదాస్, రఘు, సర్పంచ్‌లు కార్యకర్తలు ఉన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం



నవతెలంగాణ-నార్నూర్

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యులు రాంబాబు ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం మండలంలోని గుండాల, గోండుగూడ ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గర్భిణులకు రక్తం తక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రి రెఫర్ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించి, మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో తరలించారు. వైద్య శిబిరంలో ఎంఎల్ హెచ్‌పీ హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, గ్రామ పటేల్ శ్రీరాం, వైద్య సిబ్బంది విద్యారాణి, రాథోడ్ కృష్ణ, బాపూరావు, అంగన్‌వాడీ టీచర్ సీతాబాయి ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, బీకాం, బీజడ్‌సీ, బీఏ గ్రూపుల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు కనీసం తాగడానికి మంచినీరు కూడా లేని పరిస్థితి నెలకొంది. హైవే రోడ్డు నుండి కళాశాలకు వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో విద్యార్థులు నానా తంటాలు పడాల్సి వస్తుంది. విద్యార్థులు అనేకసార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేసినా సౌకర్యాలు కల్పించడం లేదు. కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు సరైన విద్యాబోధన చేయాల్సిన అవసరం ఎంతైనా



ఉంది. కొంతమంది ప్రయివేటు, అవుట్ సోర్సింగ్ అధ్యాపకులతో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. కళాశాలలో మొదటి, రెండవ, మూడో సంవత్సరంలో మొత్తం 500కు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అక్రమ మద్యం సమాచారం అందించాలి

నవతెలంగాణ-లక్సెట్టిపేట

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత నెల నుడి ఇప్పటి వరకు లక్సెట్టిపేట పరిధిలో 109 కేసులు నమోదు చేసి 80 మందిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఎస్.బాబా తెలిపారు. ఇప్పటి వరకు తనిఖీలో 304 లీటర్ల నాటుసారా, 234 కిలోల బెల్లం, 221 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 16400 బెల్లం ధ్వంసం చేసినట్టు తెలిపారు. మద్యం గొలుసుల దుకాణాల్లో 99.74 లీటర్ల మద్యం, 251.31 లీటర్ల బీర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని, అక్రమ రవాణాకు ఉపయోగించే 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 26 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్టు తెలిపారు. అక్రమ మద్యం, రవాణాకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 18004252523, ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ నెంబర్ 8712658787కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



నవతెలంగాణ-మందమర్రి

రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని డీసీపీ సుధీర్ కేకన్ సూచించారు. శుక్రవారం మందమర్రి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని హిస్టరీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు తమ ప్రవర్తనను మార్చుకోవాలని, ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంటుందని, గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని తెలిపారు. నేరప్రవృత్తి వీడి మంచి ప్రవర్తనతో కుటుంబాలతో కలిసి జీవించాలని సూచించారు. నేర ప్రవృత్తి వీడకపోతే పీడీ యాక్టు తప్పదని డీసీపీ హెచ్చరించారు. ప్రజా జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. అనవసరమైన గొడవలకు, కొట్లాటల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ముందస్తు చర్యల్లో భాగంగా వారిని తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, మందమర్రి ఎస్ఐలు చంద్రకుమార్, హరిశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళను మోసం చేసిన కేసులో కౌన్సిలర్‌కు జైలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళను మోసం చేసిన కేసులో అధికార పార్టీ కౌన్సిలర్ జైలు పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని 6వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ పిర్సింగుల జయచందర్ అదే వార్డుకు చెందిన మహిళను శారీరకంగా వాడుకొని పెళ్లికి నిరాకరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గతంలో కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకాగా బెయిల్ మంజూరైంది. బెయిల్‌పై వచ్చిన జయచందర్ తనను బెదిరింపులకు గురి చేస్తున్నాడని, బెయిల్ రద్దు చేయాలని బాధిత మహిళ కోర్టుకు విన్నవించుకోగా సిర్పూర్ (టి) మున్సిఫ్ కోర్టు జడ్జి బెయిల్ రద్దు చేసి రిమాండ్‌కు ఆదేశాలు జారీ చేసినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ మేరకు కౌన్సిలర్‌ను జైలు కు తరలించారు.

నామినేషన్ సెంటర్ల వద్ద పటిష్ట బందోబస్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. భద్రత ఏర్పాట్లకు సంబంధించిన అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైన చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, వాంకిడి సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిరుద్యోగ నిర్మూలన కాంగ్రెస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-సారంగాపూర్

నిరుద్యోగ నిర్మూలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ నాయకులు శ్రీ శైలం, ప్రసాద్ లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి, నిరుద్యోగ విద్యార్థి తల్లిదండ్రులకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశంపై ఏర్పడ్డ తెలంగాణ దొరల గడీలో బంధి అయ్యిందన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఇంట్లో తప్ప తెలంగాణలో ఎవ్వరికీ ఉద్యోగాలు రాలేదని అన్నారు. ఉద్యోగాల కోసం అహర్నిశలు కష్టపడి చదివితే గ్రూప్-1 పేపర్ లీకేజ్‌తో ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అరికట్టాలంటే ఓటు వజ్రాయుధమని అన్నారు. కొట్లాడి నిరుద్యోగ ఆకాంక్షను సఫలం కావడం కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ సభ్యులు శ్రీకాంత్, రాజేందర్, శివ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ్, రాజేశ్వర్, బొల్లోజ నర్సయ్య భోజగౌడ్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర కార్తీక మాసంతో పాటు నవంబర్, డిసెంబర్, జనవరి నెలలో అయ్యప్ప స్వామి భక్తులు పవిత్ర మాల ధారణతో అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి శబరిమల వెళ్లి రావడానికి ఆర్టీసీ రాయితీతో కూడిన ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శబరిమలకు బస్సు అద్దెకు బుక్ చేసుకున్న వారికి బస్సులో 5 మందికి ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంటమనుషులకు, సీట్ సౌకర్యం లేకుండా ఒక అటెండెంట్‌కు ఉచిత ప్రయాణం అవకాశం కల్పిస్తామని తెలిపారు. బస్సు బుక్ చేసిన ఒక గురుస్వామికి ఉచిత ప్రయాణంతో పాటు ఒకటి కంటే ఎక్కువ బస్సులను బుక్ చేస్తే ఆ అదనపు బస్సులపై ప్రయాణ రోజులకు, రోజుకు రూ.300 పారితోషకం సైతం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9959226002, 7382800975 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సేవలను అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.